# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 1 సంచిక : 22 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శనివారం 10 ఆగస్టు 2024 వెల : 5/-రూ॥

VOLUME :1 ISSUE : 22 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGLE SAT10 AUGUST 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## వేల కోట్లు ఖర్చు చేస్తే రెండు లక్షల మంది విద్యార్థులు ఎలా తగ్గారు?



‘సాల్ట్’ ప్రాజెక్టుపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ సమీక్ష

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని స్పష్టీకరణ

అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేడు ‘సాల్ట్’ ప్రాజెక్టుపై పాఠశాల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన బోధనతో ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచాలని సూచించారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ కచ్చితంగా ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను

వివరాలు 2లో..

# పోలీసుల సమక్షంలోనే పెద్దసుబ్బారాయుడిని చంపేశారు

- నంద్యాల జిల్లాలో వైసీపీ కార్యకర్త హత్య
- కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- ఏజెంటుగా కూర్చున్నందుకు చంపేశారని ఆగ్రహం
- పోలీసుల సమక్షంలోనే హత్యాకాండ జరిగిందని ఆరోపణ
- చంద్రబాబు, లోకేశ్ లను కూడా ముద్దాయిలుగా చేర్చాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:నంద్యాల జిల్లా సీతారామాపురంలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త పెద్దసుబ్బారాయుడు కుటుంబాన్ని మాజీ సీఎం జగన్ ఈ మధ్యాహ్నం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలీసుల సమక్షంలోనే పెద్దసుబ్బారాయుడిని చంపేశారని వెల్లడించారు. పెద్దసుబ్బారాయుడి భార్యపై కూడా దాడి చేశారని మండిపడ్డారు. నిందితులు పారిపోవడానికి పోలీసులు సహకరించారని ఆరోపించారు. నిందితుల కాల్ డేటా చూస్తే ఎవరు చేయించారో అర్థమవుతోందని, ఈ కేసులో చంద్రబాబు, లోకేశ్ లను కూడా ముద్దాయిలుగా చేర్చాలని జగన్ డిమాండ్ చేశారు. ఏజెంటుగా కూర్చున్నందుకు హత్య చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు మీటింగ్ లు పెట్టి, చంపాలని చెబుతున్నారని, హత్య చేయించిన వారిని కూడా జైల్లో పెట్టాలని అన్నారు. సీతారామాపురం గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని తెలిసి కూడా ఎందుకు అదనపు బలగాలను దించలేదని ప్రశ్నించారు. ఆ తర్వాత ఎస్సై సమక్షంలోనే మారణకాండకు దిగారని, నిందితులు గ్రామం వదిలి వెళ్లిపోయేవారకు వారిని పట్టుకునేందుకు పోలీసులు ఎందుకు ప్రయత్నించలేదని నిలదీశారు. ఏపీలో రెడ్ బుక్ పాలన కొనసాగుతోందని, ఆధిపత్యం కోసం హత్యలు చేస్తున్నారని జగన్ వ్యాఖ్యానించారు. సీతారామాపురం ఘటనపై హైకోర్టుకు వెళతామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళతామని స్పష్టం చేశారు.

## 17 నెలల తర్వాత జైలు నుంచి ఇంటికి మనీష్ సిసోడియా



సీబీఐ, ఈడీ రెండు కేసుల్లో బెయిల్

పాస్ పోర్టు సరండర్ చేయాలని ఆదేశం

ప్రతి సోమవారం విచారణకు హాజరు కావాలని కండీషన్

అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్: ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఎట్టకేలకు జైలు నుంచి విడుదలయ్యారు. దేశవ్యాప్తంగా

వివరాలు 2లో..

## రీషెడ్యూల్ చేయలేం.. నీట్ పీజీ 2024 పరీక్షపై సుప్రీం కోర్టు



పెన్ పవర్ డెస్క్:నీట్ పీజీ 2024 విషయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. నీట్ పీజీ 2024 పరీక్షను రీషెడ్యూల్ చేయాలని ఆదేశాలివ్వలేమని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్?తో నేతృత్వంలోని అపెక్స్ కోర్టు బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. ఎగ్జామ్?ను రీషెడ్యూల్ చేయలేమని.. రెండు లక్షల మంది విద్యార్థులు, నాలుగు లక్షల మంది తల్లిదండ్రులపై ప్రభావం పడుతుందని సుప్రీం

వివరాలు 2లో..

# చెల్లాచెదరైన కేడర్




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ శ్రీకాకుళం, ఆగస్టు 9:** ఉత్తరాంధ్రలో వైసీపీ వైభవం కొట్టుకుపోతోంది. రానురానూ పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. ఐదేళ్లపాటు ఎదురులేని దర్జా వెలగబెట్టిన పార్టీ, ఇప్పుడు దిక్కులు చూస్తోంది. వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్‌మెంబర్ అభ్యర్థి ఎటు చూసినా గిర్రున తిరుగుతూ కనిపించిన ఫ్యాన్ పవర్ కట్ అయ్యి కుదేలైపోయింది. కనిపించిందంతా బలమే అనుకుని

వివరాలు 2లో..

# వైసీపీలో ఏం జరుగుతోంది....

## వరుస షాక్ లు ఇస్తున్న నేతలు

**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, కాకినాడ ఆగష్టు9:** ఈ ఎన్నికల్లో వైసిపి దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి కోలుకుంటోంది. అయితే ఆ పార్టీకి షాక్ లు తప్పడం లేదు. నిన్న ఒక్కరోజే మూడు ఘటనలు ఆ పార్టీని దారుణంగా దెబ్బతీశాయి. పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. 2019లో 151 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అద్భుత విజయం సాధించింది. దేశాన్ని తన వైపు చూసుకునేలా చేసింది. కానీ ఐదేళ్లు తిరిగేసరికి దానికి మించి ఓటమితో మరోసారి దేశంలో చర్చనీయాంశంగా మారింది. కేవలం 11 స్థానాలతో సరిపెట్టుకుంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. భారీ ఓటమితో పార్టీలో వైఫల్యాలు సైతం బయటపడుతున్నాయి.



వివరాలు 11లో..

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు... మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం



- ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ
- భారతీయులు, హిందువులు, మైనార్టీల భద్రతను పర్యవేక్షించనున్న కమిటీ
- బంగ్లాదేశ్‌లో హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై దాడులు జరుగుతుండటంతో నరేంద్రమోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మైనార్టీలపై

వివరాలు 2లో..

## టీడీపీ ప్రభుత్వంపై షర్మిల ఫైర్.. అన్న పాలనపై సెటైర్



పెన్ పవర్ డెస్క్: విత్తనాల కొరతపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణ తలా తోక లేనిదని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. సాగర్ కుడికాలువ కింద రైతులకు విత్తన కొరత లేదని గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పగలరా అని ఆమె ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో కౌంటర్ల దగ్గర రైతుల పడుతున్న కష్టాలు మీకు

వివరాలు 2లో..

## టీడీపీ గూటికి మురుగుడు




**స్టాఫ్ రిపోర్టర్ గుంటూరు, ఆగస్టు 9:** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీకి ఏమీ కలిసి రావడం లేదు. తాజాగా మంగళగిరి నుంచి పోటీ చేసిన అభ్యర్థి మురుగుడు లావణ్య మామ , మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు వైసీపీకి గుడ్ బై చెప్పే అవకాశం కని?స్తోంది. మంగళగిరిలో జరిగిన ఓ కల్యాణ మండపం

వివరాలు 2లో..

## చార్జింగ్ సమయంలో ట్యాంపరింగ్....

నాగేశ్వర రావు (నగేష్ బూర్లి), సీనియర్ జర్నలిస్టు



దేశంలో మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. 400 పార్లమెంట్ స్థానాల్లో విజయమే లక్ష్యంగా బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ బరిలో దిగింది. బిజెపి ఒంటరిగా 300 స్థానాలు దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ బిజెపి ప్రయత్నాలు తలకిందులయ్యాయి. ఆ పార్టీ కేవలం 244 స్థానాలకి పరిమితం అయ్యింది. దీంతో మిత్రపక్షాలైన తెలుగుదేశం, జెడియు

వివరాలు 2లో..

## వయనాడ్ లో భూమి లోంచి వింత శబ్దాలు... హడలిపోతున్న ప్రజలు

- ఇటీవల వయనాడ్ లో ప్రకృతి విలయం
- కొండచరియలు విరిగిపడిన ఘటనలో 413 మంది మృతి
- ఇంకా 152 మంది కోసం గాలింపు

పెన్ పవర్ డెస్క్: కేరళలోని వయనాడ్ జిల్లాలో ఇటీవల సంభవించిన ప్రకృతి విలయం తీవ్ర నష్టం కలిగించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో 413 మంది మరణించగా, ఇంకా 152 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. తాజాగా, వయనాడ్ ప్రాంతంలో భూమి లోంచి వింత శబ్దాలు వస్తున్నాయి. వయనాడ్, పాలక్కాడ్, కోజికోడ్ ప్రాంతాల్లో భూమి లోంచి విచిత్రమైన ధ్వనులు వస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఇప్పటికే కొండచరియలు విరిగిపడిన ఘటనతో



వివరాలు 2లో..

# సంపాదకీయం

## వక్ఫ్ చట్టం ఏంటి? దీనికి వ్యతిరేకంగా వాదనలు ఏంటి?

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

ఇప్పుడు ఏ నోట విన్నా వక్ఫ్ బోర్డ్ గురించే చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఈ బోర్డుకు సంబంధించి ఎన్డీయే ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకువచ్చింది. దీంతో దీని గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో కీలక సవరణలు చేయబోతోంది.వక్ఫ్ చట్టంలో 40 సవరణల ప్రతిపాదనకు ఆమోదం లభించింది. పార్లమెంటులో సవరణ బిల్లు ఆమోదం పొందిన తర్వాత వక్ఫ్ బోర్డుకు ఉన్న అనియంత్రిత అధికారాలు తగ్గుతాయి. 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో వక్ఫ్ బోర్డుకు అసాధారణ అధికారాలను అప్పగించారు. సాధారణ ముస్లింలు, పేద ముస్లిం మహిళలు, విడాకులు తీసుకున్న ముస్లిం మహిళల పిల్లలు, షియాలు, బోహ్రాలు చాలా కాలంగా చట్టంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ రోజు వక్ఫ్ లో సాధారణ ముస్లింలకు స్థానం లేదన్నారు. శక్తిమంతులు మాత్రమే ఉన్నారు. ఎంత ఆదాయం వస్తుందో ఎవరూ అంచనా వేయలేరు. ఆదాయం వచ్చినప్పుడు ముస్లింలకు మాత్రమే వినియోగిస్తామన్నారు. ప్రస్తుతం దేశంలో 30 వక్ఫ్ బోర్డులున్నాయి. అన్ని వక్ఫ్ ఆస్తుల నుంచి ఏటా రూ.200 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు.వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలకు మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. మంత్రివర్గంలో ఏదైనా ఆస్తిని వక్ఫ్ ప్రాపర్టీగా మార్చే వక్ఫ్ బోర్డు అధికారాలను అడ్డుకోవాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. ఏదైనా ఆస్తిని 'వక్ఫ్ ప్రాపర్టీ'గా గుర్తించే వక్ఫ్ బోర్డు హక్కును పరిమితం చేయడమే ఈ సవరణల ఉద్దేశం. ఆస్తులపై చేసిన క్లెయిమ్స్ ను వక్ఫ్ బోర్డు తప్పనిసరిగా ధ్రువీకరిస్తుంది. సవరణ బిల్లు ఆమోదం తర్వాత వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, బదలాయింపులో పెనుమార్పులు చోటుచేసుకోనున్నాయి. చట్ట సవరణకు గల కారణాలను కూడా ప్రస్తావించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జస్టిస్ సచార్ కమిషన్, కే రెహమాన్ ఖాన్ నేతృత్వంలోని పార్లమెంట్ జాయింట్ కమిటీ సిఫార్సులను ఉదహరించింది.ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకునేందుకు వీలు లేదు. ఈ సవరణ తర్వాత వక్ఫ్ బోర్డు తన ఆస్తిని జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది, తద్వారా ఆస్తి విలువ ఉంటుంది. రెవెన్యూపై విచారణ జరుపుతామన్నారు. ముస్లింలు మాత్రమే వక్ఫ్ ఆస్తులు నిర్మించుకోవచ్చనే నిబంధన కొత్త బిల్లులో ఉంటుంది. బోర్డు స్వరూపాన్ని మార్చడంతో పాటు అందులో మహిళల భాగస్వామ్యం కూడా ఉండేలా చూస్తామన్నారు. రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డుల్లో మహిళా సభ్యులు ఉంటారు. ఒక్కో రాష్ట్ర బోర్డులో ఇద్దరు, సెంట్రల్ కౌన్సిల్ లో ఇద్దరు మహిళలు ఉంటారు. ఇప్పటి వరకు వక్ఫ్ బోర్డు, కౌన్సిల్ లో మహిళలు సభ్యులుగా లేరు. వక్ఫ్ బోర్డు లేని చోట్ల ట్రిబ్యునల్ కు వెళ్లవచ్చు.వక్ఫ్ బోర్డుకు చెందిన వివాదాస్పద, పాత ఆస్తులను కొత్తగా పరిశీలించనున్నారు. వక్ఫ్ బోర్డు లేదా ఎవరైనా వ్యక్తులు క్లెయిమ్లు, కౌంటర్ క్లెయిమ్లు చేసిన ఆస్తులకు కూడా కొత్త సవరణ వర్తిస్తుంది. ప్రతిపాదిత చట్టం ప్రకారం.. వక్ఫ్ బోర్డు చేసే అన్ని క్లెయిమ్ లను తప్పనిసరిగా, పారదర్శకంగా ధృవీకరించడం అవసరం. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 19, 14లో మార్పులు చేయనున్నారు. దీంతో సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు రూపురేఖలు మారే అవకాశం ఉంది. వక్ఫ్ బోర్డు నిర్ణయాన్ని ఇప్పుడు హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఈ నిబంధన లేదు.2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 1995 వక్ఫ్ చట్టాన్ని సవరించి వక్ఫ్ బోర్డులకు విపరీతమైన అధికారాలను కట్టబెట్టింది. ఆస్తులను లాక్కోవడానికి వక్ఫ్ బోర్డులకు అపరిమితమైన అధికారాలు ఇచ్చేలా చట్టాన్ని సవరించారు, దీన్ని ఏ కోర్టులోనూ సవాలు చేయలేరు. సింపుల్ గా చెప్పాలంటే విరాళాల పేరుతో ఆస్తులు క్లెయిమ్ చేసుకునే అపరిమిత అధికారాలు వక్ఫ్ బోర్డుకు ఉన్నాయి. ఇది పిటిషనర్ న్యాయ వ్యవస్థ నుంచి న్యాయం కోరకుండా నిరోధించింది. దేశంలో మరే ఇతర మత సంస్థకూ ఇలాంటి అధికారాలు లేవు. వక్ఫ్ చట్టం 1995లోని సెక్షన్ 3 ప్రకారం ఆ భూమి ముస్లింకు చెందుతుందని వక్ఫ్ భావిస్తే అది వక్ఫ్ ఆస్తి. ఆ భూమి తమదేనని వక్ఫ్ బోర్డు ఎలా చెప్తుందో వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు.ప్రస్తుతం ఏదైనా ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే హక్కు బోర్డుకు ఉంది. ఈ ఆస్తి పేద ముస్లిం ప్రయోజనం కోసం ఉంటుందనే వాదన వక్ఫ్ ఆస్తులకు ప్రత్యేక హోదా ఇచ్చామని, ఇది ఏ ట్రస్టుకు అతీతమన్నారు. 'ఔకాఫ్'ను నియంత్రించడానికి ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. ఒక వక్ఫ్ విరాళంగా ఇచ్చి వక్ఫ్ గా నామకరణం చేసిన ఆస్తిని 'ఔకాఫ్' అంటారు. ముస్లిం చట్టం ద్వారా పవిత్రమైన, మతపరమైన లేదా ధార్మికంగా గుర్తించిన ప్రయోజనాల కోసం ఆస్తిని అంకితం చేసే వ్యక్తిని వకీఫ్ అంటారు.ఏ ఆస్తినైనా క్లెయిమ్ చేసుకునేందుకు వక్ఫ్ బోర్డులకు హక్కులున్నాయని, ఈ కారణంగా చాలా రాష్ట్రాల్లో అటువంటి ఆస్తుల సర్వేలు ఆలస్యమవుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఆస్తుల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు వక్ఫ్ ఆస్తులను పర్యవేక్షించడంలో జిల్లా మేజిస్ట్రేట్లను భాగస్వామ్యం చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. వక్ఫ్ బోర్డు ఏ నిర్ణయానికైనా వ్యతిరేకంగా అప్పీల్ కోర్టు వద్ద మాత్రమే ఉంటుంది, కానీ అటువంటి అప్పీళ్లపై నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితి లేదు. కోర్టు నిర్ణయమే ఫైనల్.బోర్డు ఒక ఆస్తిపై హక్కును కలిగి ఉంటే దానికి విరుద్ధంగా నిరూపించడం చాలా కష్టం. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 85 ప్రకారం తమ నిర్ణయాన్ని హైకోర్టులో కానీ, సుప్రీంకోర్టులో కానీ సవాలు చేయడానికి వీల్లేదు. ఇప్పటి వరకు వక్ఫ్ ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ, కోర్టు కానీ దర్యాప్తు చేయలేకపోయాయి. ఆదాయంపై విచారణ జరిపేందుకు ఇలాంటి కమిటీ ఉండాలని, వక్ఫ్ లో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులు ముస్లింల ప్రయోజనాల కోసం మాత్రమే ఉండాలి. ఒకరకంగా వక్ఫ్ బోర్డును మాఫియా ఆక్రమించిందని సామాన్య ముస్లిం అంటున్నారు. గతంలో చేసిన సవరణ వల్ల వక్ఫ్ బోర్డు ల్యాండ్ మాఫియాలా వ్యవహరిస్తూ ఆస్తులను కబ్జా చేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల విలువ రూ. 1.2 లక్షల కోట్లు. దీంతో సాయుధ బలగాలు, భారతీయ రైల్వేల తర్వాత దేశంలో మూడో అతిపెద్ద భూస్వామ్య సంస్థగా వక్ఫ్ బోర్డు అవతరించింది. యూపీలో అత్యధిక వక్ఫ్ ఆస్తులున్నాయి. యూపీలో సున్నీ బోర్డుకు 2,10,239 ఆస్తులు ఉండగా, షియా బోర్డుకు 15,386 ఆస్తులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వేలాది మంది వ్యక్తులు వక్ఫ్ రూపంలో బోర్డుకు ఆస్తులను అప్పగిస్తున్నారు. ఇది దాని సంపదను పెంచుతూనే ఉంటుంది.ఆస్తుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే వక్ఫ్ చట్టం 1995 ఉందని, ఆ తర్వాత 2013లో కొన్ని సవరణలు చేశామని, ప్రస్తుతం ఈ చట్టంలో ఎలాంటి సవరణలు చేయాల్సిన అవసరం లేదన్నారు.

## రీషెడ్యూల్ చేయలేం.. నీట్ పీజీ 2024 పరీక్షపై సుప్రీం కోర్టు

- మొదటి పేజి తరువాయి

కోర్టు వ్యాఖ్యానించింది. ఐదుగురు పిటిషన్లర కోసం రెండు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్?ను రిస్క్?లో ఉంచలేమని ధర్మాసనం తెలిపింది.

నీట్ 2024 పరీక్షా కేంద్రాలు సుదూరంగా ఉన్నాయని, పరీక్షకు హాజరవడానికి అసౌకర్యంగా ఉంటుందని పిటిషనర్ పేర్కొన్నారు.185 టెస్ట్ సెంటర్లను ప్రకటించారని, ట్రైన్ టికెట్లు దొరక్క, విమాన టికెట్ల ధరల పెంపు కారణంగా ఎంతో మంది విద్యార్థులు ఇబ్బందిపడే పరిస్థితి ఉందనేది పిటిషనర్ తరపు వాదన. నీట్ పీజీ 2024 పరీక్ష ఆగస్ట్ 11న జరగనుంది. రెండు షిఫ్టులలో జరుగుతుంది. ఇటీవల నీట్ యూజీ పేపర్ లీక్, పోటీ పరీక్షలల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఎన్?బీఈఎంఎస్ (నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్) జూన్ 23న జరగాల్సిన నీట్ పీజీ పరీక్షను వాయిదా వేసిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా దాదాపు 52 వేల మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల కోసం ప్రతి ఏడాది దాదాపు రెండు లక్షల మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు నీట్ పరీక్ష రాస్తుంటారు.

# చెల్లాచెదరైన కేడర్

- మొదటి పేజి తరువాయి

మురిసిపోయింది. కానీ అదంతా వాపు అని ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. ఎన్నికలలో గెలుపు ఓటములు సహజం. 2014లోనూ వైసీపీ ఓటమిపాలైంది. అయితే ఆనాడు పార్టీ నాయకుల్లోగానీ, కార్యకర్తల్లో గానీ, జగన్ అభిమానుల్లో గానీ ఎక్కడా ఇంత నీరసం చూడలేదు. ఓటమి వచ్చినా, ఐదేళ్లపాటు రెట్టించిన ఉత్సాహంతో పనిచేశారు. క్షేత్రస్థాయిలో నిజమైన ప్రతిపక్షం అనిపించారు. ఈసారి ఓటమితో దానికి పూర్తిగా భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. అప్పుడు జగన్మోహన రెడ్డి అనే వ్యక్తి గురించి ఎవరికీ ఏమీ తెలియదు. బోలెడన్ని ఆశలు భ్రమలు ఉండేవి కాబోలు అని విశ్లేషకులు చెబుతుంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌పై ఓ అంచనాకు వచ్చారని చెబుతున్నారు. జనాలకే కాదు సొంత పార్టీ నేతలకి కూడా వాస్తవం తెలిసి వచ్చిందని అంటున్నారు. ఇలా పార్టీకి దూరంగా ఉంటున్న వారిలో ఉత్తరాంధ్ర నేతలు మొదటి స్థానంలో ఉన్నారు. ఉత్తరాంధ్రలో 2014లో 9 మంది ఎమ్మెల్యేలు వైసీపీ తరఫున గెలిస్తే ఈసారి ఆ సంఖ్య రెండుకు పడిపోయింది. అదీ ఏజెన్సీలోని పాడేరు, అరకు సీట్లే. మొత్తం 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 32 సెగ్మెంట్‌లలో భారీ ఓటమి ఎదుర్కొంది. సోషల్ ఇంజినీరింగ్ పేరుతో ఎక్కడెక్కడి నుంచో అభ్యర్థులను తీసుకొచ్చి ఎన్నికల్లో పోటీ చేయించారు. ఓడిపోయిన తర్వాత వాళ్లంతా సొంత ప్రాంతాలకు వెళ్లిపోవడంతో చాలా నియోజకవర్గాల్లో వైసీపీకి ఇన్‌ఛార్జ్‌లు లేని పరిస్థితి ఉంది.

ఉమ్మడి శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాను పరిశీలిస్తే పాతపట్నంలో రెడ్డి శాంతి ఓటమి అందరూ ఊహించిందే. ముందు నుంచి ఆమెపై వ్యతిరేకత ఉంది. పాతపట్నంలో వైసీపీ నాయకులెవరూ ఆమెను ఇన్చార్జ్ అంగీకరించడం లేదు. కొత్తవారిని పెట్టాలని కోరుతున్నారు.

ఆముదాలవలస: మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నప్పటికీ కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తే బాగుంటుందనే సూచనలు వినిపిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ రెబల్‌గా పోటీ చేసిన గాంధీ, చింతాడ రవికుమార్‌లో ఒకరికి బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్ ఉంది.

టెక్కలి: టెక్కలిలో దువ్వాడ శ్రీనివాస్ తప్ప జగన్‌కు మరో నేత కనిపించలేదు. కింజరాపు కుటుంబాన్నే టార్గెట్ చేసిన ఈయనకు ఓటమి తప్పలేదు. ఇక్కడ పేరాడ తిలక్‌ను నియమిస్తే పార్టీ మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని కేడర్ అభిప్రాయం.

శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ధర్మాన ప్రసాదరావు రిటైర్మెంట్ మూడ్‌లో ఉన్నారు. కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు పొలిటికల్ కెరీర్ నిర్మించే పనిలో పడ్డారు. వైసీపీలో ఉండే ఆలోచనే లేదని తెలుస్తోంది. దీంతో ఇక్కడ కూడా పార్టీ కొత్త వారికి ఛాన్స్ ఇస్తే బాగుంటుందనే మాట వినిపిస్తోంది.

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలో ముందు నుంచి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మీద తీవ్ర అసంతృప్తి ఉంది. ఆ అసంతృప్తే బీజేపీని గెలిపించింది. కిరణ్‌ను తప్పిస్తే తప్ప అక్కడ పార్టీ బాగుపడే సూచన కనిపించడం లేదంటున్నారు నేతలు.

పాలకొండ : మాజీ ఎమ్మెల్యే కళావతి స్థానంలో మార్పు అవసరం అని క్యాడర్ చెబుతోంది.కొత్త నీరు వస్తేనే పార్టీ బతుకుతుందని వారి ఆలోచన.

రాజాం : రాజాంలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులను మార్చి రాజేష్‌కు అవకాశం ఇచ్చారు. ఓడిపోయిన తర్వాత ఆయన ఎక్కడ ఉన్నారో కనిపించడం లేదని కేడర్ ఫిర్యాదు చేస్తోంది. ఇక్కడకూడా గట్టి నాయకుడ్ని నియమించాలని సూచిస్తున్నారు. .

నరసన్నపేట: నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్ చురుకుగానే ఉన్నారు. కానీ కేడర్ మార్పు కోరుతోంది. మొన్నటి ఎన్నికల్లో సెకెండ్ క్యాడర్ టీడీపీకి వెళ్లిపోయింది. సో.. ఇక్కడ కూడా నియోజకవర్గ ఇన్చార్జ్ మార్పు కోరుతున్నారు.

పలాస: పలాసలో డా.సీదిరి అప్పలరాజు బలమైన నాయకుడు. ఆయన నాయకత్వంలో పార్టీ యాక్టివ్‌గానే ఉంది. నిరాశాజనక వాతావరణంలోనూ పార్టీ చురుకుగా పనిచేస్తోందని అంటున్నారు. ఆయనపై నియోజకవర్గం లీడర్లు కూడా సానుకూలంగానే ఉన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నుంచి పోటీ చేసిన పిరియా విజయ ఓటమితో డీలా పడిపోయారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు కొంత హడావిడి చేస్తున్నట్టు కనిపిస్తోంది. విజయ ఓటమి ఆయనకు కలిసి వచ్చిందంటున్నారు కేడర్. ఆయనకు ఈసారి ఇన్‌ఛార్జ్ పదవి లభిస్తుందనే అంచనాల్లో ఉన్నారు. అందుకే ఆయన చురుగ్గా ఉన్నారని టాక్

## టీడీపీ ప్రభుత్వంపై షర్మిల ఫైర్.. అన్న పాలనపై సెటైర్

- మొదటి పేజి తరువాయి

కనిపించడం లేదా అని నిలదీశారు. సంబంధిత శాఖ మంత్రిగా నేరుగా పరిస్థితి చూసే మాట్లాడుతున్నారా అని షర్మిల విస్మయం వ్యక్తం చేశారు.రాత్రంతా క్యూలైన్లో రైతులను నిలబెట్టడమా మీ %చీణూ% ప్రభుత్వ ఏలుబడి అని ఆమె ప్రశ్నించారు. సంక్షోభం నుంచి సంక్షేమం అంటే కుండపోత వర్షంలో మహిళలను ఇబ్బందులు పాలు చేయడమే కాబోలు అని షర్మిల ఎద్దేవా చేశారు. రైతుల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ము లేక కుటుంబాన్ని గుంజుతున్నారని మండిపడ్డారు.

వైసీపీ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టకనే కదా మీకు పట్టం కట్టింది, జగన్ నిండా ముంచారనే కదా 11 సీట్లకు పరిమితం చేసిందని టీడీపీ ప్రభుత్వంపై షర్మిల ప్రశ్నలు సంధించారు. మోసం చేశారనే కదా కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని వైసీపీ పాలనపై షర్మిల విమర్శలు చేశారు. రైతులను వ్యతిరేకించే బీజేపీతో మీరు కూటమి కట్టి, పక్షపాతిగా ఉంటామని హామీలు ఇచ్చి, గద్దెనెక్కి, ఇప్పుడు వాళ్లను వర్షంలో నిలబెట్టారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది మీ సర్కారుకి

న్యాయమా అని ప్రశ్నించారు. నాట్లు వేసిన 130 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని జేజీఎల్ 384 రకం విత్తనాలను కావాలని అడగడం రైతులు చేసిన పాపం అంటారా అని నిలదీశారు. రైతు అడిగింది ఇవ్వాలని హక్కుగా మేము ప్రశ్నిస్తే రెచ్చగొట్టినట్లు ఎలా అవుతుందో, వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

## వేల కోట్లు ఖర్చు చేస్తే రెండు లక్షల మంది విద్యార్థులు ఎలా తగ్గారు?

- మొదటి పేజి తరువాయి

ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహా అందరం మోడల్ పీటీఎం సమావేశాలు వస్తామని తెలిపారు. విద్యపై గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెబుతోందని, వేల కోట్లు ఖర్చు చేస్తే రెండు లక్షల మంది విద్యార్థులు ఎలా తగ్గారని లోకేశ్ ప్రశ్నించారు. ఇక, విద్యార్థుల్లో నైతక విలువలు పెంచేలా, మహిళలను గౌరవించేలా పాఠ్యాంశాల్లో మార్పులు చేస్తామని చెప్పారు.

## 17 నెలల తర్వాత జైలు నుంచి ఇంటికి మనీష్ సిసోడియా

- మొదటి పేజి తరువాయి

సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణం లో 17 నెలల నుంచి ఆయన జైలు జీవితం గడుపుతున్నారు. దాదాపు సంవత్స రంనర పాటు జైలులో ఉన్న సిసోడియాకు ఇన్నాళ్లకు బెయిల్ మంజూరైంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంలో మనీలాం డరింగ్‌కు పాల్పడారనే అభియోగాలతో ఆయనను అరెస్ట్ చేశారు. 2023, ఫిబ్రవరి 26వ తేదీన మనీష్ సిసోడియాను సీబీఐ కస్టడీలోకి తీసుకుంది. మార్చి 9వ తేదీ రాత్రి అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి తీహార్ జైలులోనే ఉన్నారు. ఇదే కేసులో ప్రస్తుతం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కవిత తీహార్ జైలులోనే ఉన్న సంగతి తెలిసిందే. మనీష్ సిసోడియాకు సుప్రీం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

## వయనాడ్ లో భూమి లోంచి వింత శబ్దాలు... హడలిపోతున్న ప్రజలు

- మొదటి పేజి తరువాయి

తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్న ప్రజలు... భూమి లోంచి వస్తున్న ధ్వనులతో ఇంకేం విపత్తు సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

ఈ ఉదయం 10.30 సమయంలో భూమి లోంచి శబ్దాలు రావడంతో స్కూళ్లలోని విద్యార్థులు బయటికి పరుగులు తీశారు. పలు ప్రాంతాల్లో ఇలాంటి శబ్దాలు రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. భూకంపం వస్తుందేమోనంటూ ప్రచారం మొదలైంది. అయితే, సెంటర్ ఫర్ సీస్మాలజీ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కేరళ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఈ శబ్దాల వల్ల ప్రమాదమేమీ లేదని, భూకంపం వస్తుందన్న భయాలు అవసరం లేదని స్పష్టం చేశాయి.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు... మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మొదటి పేజి తరువాయి

దాడుల ఘటన మీద భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను... సరిహద్దులో నెలకొన్న పరిస్థితులను సమీక్షించేందుకు కేంద్రం ఐదుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో భారతీయులు, హిందువులు, ఇతర మైనార్టీల భద్రతను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఈ కమిటీని నియమించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ వెల్లడించింది.బంగ్లాదేశ్ లోని భారతీయులు, హిందువులు, మైనార్టీల భద్రత, సౌకర్యాలకు సంబంధించి అక్కడి హోంమంత్రిత్వ శాఖ అధికారులతో ఈ కమిటీ చర్చలు జరుపుతుంది. ఈ కమిటీలో బీఎస్ఎఫ్ సౌత్ బెంగాల్ ఐజీ, బీఎస్ఎఫ్ త్రిపుర ఐజీ, ఇండియన్ ల్యాండ్ పోర్ట్స్ అథారిటీకి చెందిన ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సభ్యుడు, సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడి మైనార్టీ వర్గాల భద్రత కోసం ఈ కమిటీని ఏర్పాటు చేశామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇస్లామిక్ ఛాందసవాదులు బంగ్లాదేశ్‌లోని హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం మొదలైన దాడుల్లో ఇప్పటి వరకు వందలాది మంది మృతి చెందారు. దాడుల భయంతో హిందువులు సహా చాలా మైనార్టీ కుటుంబాలు మూకుమ్మడిగా వలస బాట పట్టాయి. వారు భారత్‌లోకి వచ్చేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ సరిహద్దులోని ఠాకూర్‌గావ్, పంచగఢ్ ప్రాంతాలకు వేలాదిమంది హిందువులు చేరుకున్నారు. పలుచోట్ల ఇళ్లు, దుకాణాలతో పాటు దేవాలయాల్లోని విలువైన వస్తువులను సైతం దుండగులు దోచుకువెళ్లినట్లుగా తెలుస్తోంది. అక్కడే ఉంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు.

## టీడీపీ గూటికి మురుగుడు

- మొదటి పేజి తరువాయి

ప్రారంభోత్సవ కార్యక్రమంలో నారా లోకష్ తో పాటు ఆయన కూడా పాల్గొన్నారు. అదే వేదిక మీద నుంచి చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పద్మశాలి కుల వృత్తుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు వీవర్సకు జిఎస్టి లేకుండా కేంద్రంతో మాట్లాడి తీసేస్తామని హామీ ఇచ్చారన్నారు. చేనేతలకు మగ్గాలు లేని వారికి సొంత ఇల్లు నిర్మిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీకి వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంశం మంగళగిరిలో చర్చనీయాంశంగా మారింది . టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకునే ఆయన ఇలా మాట్లాడుతున్నారని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. మురుగుడు హనుమంతరావు మొదట్లో కాంగ్రెస్ పార్టీ లో ఉండేవారు. ఆయన 1999, 2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి 2009లో ఆయనకు టిక్కెట్ దక్కలేదు కానీ ఆయన వియ్యంకురాలు కాండ్రు కమలకు కాంగ్రెస్ టిక్కెట్ దక్కింది. ఆమె కూడా విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితుల్లోకి వెళ్లింది. వైసీపీలో చేరినా మురుగుడు హనుమంతరావుకు టిక్కెట్ దక్కలేదు. వైసీపీ తరఫున రెండు సార్లు ఆళ్ల రామకృష్ణారెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. మురుగుడు హనుమంతరావు మధ్యలో ఓ సారి టీడీపీలో చేరి .. టీడీపీ ఓడిపోయిన తర్వాత మళ్లీ వైసీపీలో చేరారు. వైసీపీ అధినేత జగన్ మురుగుడు హనుమంతరావుకు ఎమ్మెల్సీ ఇచ్చారు. చేనేతవర్గం నుంచి అభ్యర్థిని లోకేష్‌పై పోటీకి పెట్టాలని డిసైడ్ కావడంతో మురుగుడు హనుమంతరావుతో పాటు కాండ్రుకమల కూడా టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నం చేశారు. కానీ టీడీపీ నుంచి ఓ సారి ఎన్నికల్లో పోటీ చేసిన గంజి చిరంజీవిని పార్టీలో చేర్చుకున్న జగన్ ఆయనకే టిక్కెట్ ఇవ్వాలనుకున్నారు. కానీ లోకేష్ ను ఎదుర్కోలేకపోతున్నారని చివరి క్షణంలో మురుగుడు హనుమంతరావు కోడలు, కాండ్రు కమల కుమార్తె అయిన లావణ్యకు టిక్కెట్ ఇచ్చారు. అయితే ఆమె కూడా కనీస పోటీ ఇవ్వలేకపోయారు. 90వేలకుపైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఎన్నికలు ముగిసిన తర్వాత వైసీపీ కీలక నేత ఇంట్లో పెద్ద ఎత్తువ మద్యం నిల్వలు బయటపడ్డాయి. ఈ మద్యం నిల్వలు మురుగుడు లావణ్య తండ్రివేనని పోలీసులు తేల్చారు. దీంతో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో వారు వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడం తగ్గించారు. ఇప్పుడు నేరుగా చంద్రబాబును పొగడటంతో వారు పార్టీ మారుతారన్న ప్రచారం ప్రారంభమయింది.

## చార్జింగ్ సమయంలో ట్యాంపరింగ్....

- మొదటి పేజి తరువాయి

మద్దతుతో మోడీ మూడోసారి అధికారంలోకి రాగలిగారు. గత రెండు ఎన్నికల్లో సునాయాసంగా అధికారంలోకి వచ్చారు మోడీ. మ్యాజిక్ ఫిగర్ కు అవసరమైన స్థానాలను సొంతంగానే దక్కించుకున్నారు. అప్పట్లోనే ఈవీఎంల ట్యాంపరింగ్ పై రకరకాల అనుమానాలు నడిచాయి. అయితే గత రెండు ఎన్నికలకు భిన్నంగా.. బిజెపికి స్థానాలు తగ్గాయి. ఇండియా కూటమి పార్టీలకు సీట్లు పెరిగాయి. దీంతో జాతీయస్థాయిలో ఈవీఎంల ట్యాంపరింగ్ పై అనుమానాలు తగ్గాయి. కానీ ఏపీలో మాత్రం తెలుగుదేశం పార్టీ కూటమి ఏకపక్ష విజయం దక్కించుకోవడంతో కొత్త అనుమానాలు ప్రారంభమయ్యాయి. వై నాట్ 175 అన్న నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వైసిపి దారుణంగా దెబ్బతింది. ఆ పార్టీకి కేవలం 11 స్థానాలు వచ్చాయి. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. అయితే ఈ స్థాయి ఓటమి ఎదురయ్యేసరికి ఏపీలో వైసీపీ నేతలు ఈవీఎంల ట్యాంపరింగ్ పై అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై కూటమి పార్టీలు ఎదురు దాడి చేశాయి. 2019 ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ తోనే మీరు గెలిచారా అంటూ ప్రశ్నించేసరికి.. సోషల్ మీడియా వేదికగా రచ్చకు దారితీసింది.భారీ ఓటమితో వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. తెర వెనుక ఏదో జరిగిందన్న అనుమానాలతో ఉన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 20వేల మెజారిటీ తగ్గకుండా.. 95 వేల వరకు గరిష్టంగా నమోదు కావడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఈవీఎంలలో కుట్ర జరిగిందన్న అనుమానాలతోనే ఎక్కువ మంది ఉన్నారు. మరోవైపు ఈవీఎంల చార్జింగ్లపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మే 13న పోలింగ్ జరిగింది. అక్కడకు మూడు వారాల తర్వాత జూన్ 4న ఓట్లను లెక్కించారు. అయితే విజయనగరం పార్లమెంట్ స్థానంలో చాలా ఈవీఎంలలో చార్జింగ్ 99% ఉన్నట్లు వైసీపీ నేతలు గుర్తించారు. దీనిపైనే అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు.విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బెల్లాన చంద్రశేఖర్ ఈవీఎంల చార్జింగ్ పై ఫిర్యాదు చేశారు. విచారణ కోసం జూన్ 10న రూ. 94,400 ఫీజు కూడా చెల్లించారు. అలాగే ఒంగోలు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాస్ రెడ్డి.. 12 ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు గాను రూ. 5,66,400 ఫీజు చెల్లించారు. బొబ్బిలి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి శంబంగి చిన్న అప్పలనాయుడు కూడా ఇదే తరహాలో ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతల అనుమానాలను నివృత్తి చేయడానికి ఈనెల 25 నుంచి 28 వరకు ఈవీఎంలు తయారుచేసిన కంపెనీ ప్రతినిధులు, ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నారు.అయితే విచారణకు ముందు ఇప్పుడు ఎన్నికల అధికారుల వ్యవహరిస్తున్న తీరు హాట్ టాపిక్ గా మారుతోంది. చాలామంది అధికారులు నేరుగా ఫిర్యాదుదారులకు ఫోన్ చేసినట్లు సమాచారం. ఫిర్యాదులను వెనక్కి తీసుకుంటేచెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తామని చెప్పినట్లు తెలుస్తోంది.తనకు నేరుగా ఎన్నికల అధికారులే ఫోన్ చేశారని.. విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బెల్లాన చంద్రశేఖర్ చెబుతున్నారు. తాను మాత్రం ఫిర్యాదును వెనక్కి తీసుకోనని చెప్పినట్లు ఆయన చెప్పుకొస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# మద్యం పాలసీలోనే రిజర్వేషన్లు

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు



ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ పాలసీ మారబోతోంది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పాలసీ అమల్లోకి తేవాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇప్పుడున్న విధానానికి పూర్తి స్థాయిలో మార్పు ఉండబోతోంది. ఇప్పుడు ప్రభుత్వమే దుకాణాలు అద్దెకు తీసుకుని సిబ్బందిని నియమించుకుని.. సొంతంగా అమ్మకాలు చేస్తోంది. ఈ క్రమంలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు కూడా సీఐడీ విచారణకు ఆదేశించారు. అందుకే పాలసీలో మార్పు ఖాయమయింది. అధికారులు ఇతర రాష్ట్రాల్లో విధానాలను పరిశీలిస్తున్నారు. అయితే కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు మద్యం దుకాణాల కేటాయింపుల్లో కొన్ని సామాజిక తరగతులకు రిజర్వేషన్ కల్పించాలని చెప్పడంతో.. దుకాణాల వేలం పాట ఖాయమన్న అభిప్రాయం వినిపిస్తోంది. మద్యం దుకాణాల కేటాయింపుల్లో కొన్ని సామాజిక తరగతులకు రిజర్వేషన్ కల్పించాలని చంద్రబాబు త్వరలో ప్రకటించనున్న నూతన మద్యం పాలసీలో ఈ మేరకు ప్రతిపాదించనున్నారు. సంప్రదాయంగా కల్లుగీత వృత్తిలో ఉంటున్న వారు గతంలో మద్యం దుకాణాల నిర్వహణలో ఎక్కువగా ఉండేవారు. అయితే మధ్యలో బడా వ్యాపారులు చొరబడటంతో వారి ప్రాధాన్యం తగ్గిపోయింది. గత ప్రభుత్వం పాలసీని మార్చేయడంతో ఎవరికీ అవకాశం రాలేదు. ఈ సారి గౌడ, ఈడిగలకు ప్రాధాన్యత ఇచ్చేలా మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్ విధానాన్ని అమలుచేయాలని చంద్రబాబు నిర్ణయించారు. సోమవారం జరిగిన కలెక్టర్‌ల రాష్ట్రస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఈ దిశలో కొన్ని సూచనలు చేశారు. గౌడ, ఈడిగ సామాజిక తరగతులవారు సాంప్రదాయంగా కల్లు విక్రయాలు చేస్తారని, వారికి మద్యం షాపుల్లో 15 నుంచి 20 శాతం షాపులను కేటాయించే అంశంపై ఆలోచన చేయాలని ఆయన సూచించారు. గత ఎన్నికలకు ముందు మద్యం దుకాణాల వేలం పాటను నిర్వహించిన కేసీఆర్ ప్రభుత్వం ఎక్సైజ్ చట్టంలో మార్పులు చేసింది. తెలంగాణా ఎక్సైజ్ చట్టం 1968 లోని సెక్షన్ 17 (1 ) (ఎ ) అనుసరించి ప్రభుత్వ ఏ- 4 రిటైల్ షాపుల లైసెన్సులను 2021 -23 సంవత్సరానికి గాను రిజర్వేషన్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గౌడ్‌లకు 15 శాతం, షెడ్యూల్డు కులాలకు 10 శాతం, షెడ్యూల్డు తెగలకు 5 శాతం కేటాయించారు. ఆ నిబంధనల ప్రకారమే .. జిల్లాల వారీగా రిజర్వేషన్లు అమలు చేశారు. లాటరీ తీసి దుకాణాలను ఆయా సామాజికవర్గాల వారీగా కేటాయించారు. ఆ ప్రకారం వేలం నిర్వహించారు. ఈ కారణంగా ఆయా వర్గాల నుంచి కొంత మంది మద్యం దుకాణాలు దక్కించుకోగలిగారు. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు ఇచ్చేలా ఆరు రాష్ట్రాల్లో మద్యం విధానాన్ని అద్యయనం చేసేందుకు నాలుగు కమిటీలను ఏర్పాటు చేసింది. ఉత్తర ప్రదేశ్, రాజస్తాన్, కేరళ, తమిళనాడు, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల్లో ఆయా కమిటీలు అద్యయనాన్ని ప్రారంభించింది. ఆ కమిటీలు ఈ నెల 12 తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నాయి. ఆ నివేదిక ఆదారంగా రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించనుంది. ఇక ప్రభుత్వ రంగంలో ఎంత మాత్రం దుకాణాలు సాగే అవకాశం లేదు. వేలం పాట నిర్వహించడం ఖాయమని అనుకోవచ్చు. ఈ దిశగా అధికారులు ఇచ్చే నివేదికలను ఆమోదించిన తర్వాత .. రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనున్నారు. గౌడ, ఈడిగ కులాలకే కేటాయిస్తారా లేకపోతే ఎస్సీ , ఎస్టీలకూ కేటాయిస్తారా అన్నది అప్పుడు తేలే అవకాశం ఉంది.

# విజయవాడ స్కూళ్లలో డ్రగ్స్....

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు



ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల వినియోగంపై గత కొంత కాలంగా నెలకొన్న ఆందోళనకు అద్దంపట్టే ఘటన వెలుగు చూసింది. స్కూల్ విద్యార్థుల బ్యాగ్‌లలో డ్రగ్స్, లక్షల్లో నగదు పట్టుబడింది. ఆ తర్వాత వరుస ఘటనలు వెలుగు చూడటంతో పాఠశాలల్లో ఏం జరుగుతుందనే ఆందోళన నెలకొంది. వారం రోజుల క్రితం విజయవాడలో ప్రముఖ విద్యా సంస్థలో ప్రిన్సిపల్ ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా కొందరు విద్యార్థులు టాయిలెట్స్‌లో డ్రగ్స్ వినియోగిస్తూ కనిపించారు. వెంటనే 9,10వ తరగతులకు చెందిన విద్యార్థుల స్కూల్ బ్యాగ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో కొందరి వద్ద ఎలక్ట్రానిక్ సిగర్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు లభించాయి. వాటిని వినియోగిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి స్కూల్ యాజమాన్యం కౌన్సిలింగ్ ఇచ్చింది. బాధ్యులైన విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆందోళన కలిగించే విషయాలు వెలుగు చూశాయి. కొద్ది రోజుల క్రితంఇదే పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఆన్‌లైన్ గేమ్స్‌లో లక్షల రుపాయలు సంపాదించాడు. వాటిని తన వద్ద ఉంచుకుంటే ఇబ్బంది కలుగుతుందని భావించి దాదాపు ఆరేడు లక్షల రుపాయల నగదును స్నేహితులకు ఇచ్చాడు. ఆ డబ్బును ఇళ్లకు తీసుకువెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీయడంతో స్నేహితుడు ఇచ్చాడని చెప్పడంతో వారు పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. స్కూల్లో విచారణ చేపట్టడంతో సదరు విద్యార్థి నిరంతరం ఆన్‌లైన్‌లో రకరకాల బెట్టింగ్ గేమ్స్ ఆడుతున్నట్టు తేలింది. వాటితో సంపాదించిన డబ్బును స్నేహితులకు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ ఘటనకు బాధ్యుడైన విద్యార్థిపై కూడా స్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఉత్తరాదికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ డబ్బును పాఠశాలకే వదిలేసినట్టు సమాచారం. ఈ డబ్బును ఏమి చేయాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. 9వ తరగతి చదివే కొంతమంది విద్యార్థులు ఇటీవల విజయవాడలోని ఓ స్టార్ హోటల్లో పార్టీ చేసుకున్నారు. 14ఏళ్లలోపు పిల్లలు మాత్రమే ఉన్న బృందానికి నగరంలోని చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై ఉన్న స్టార్ హోటల్లో పార్టీ చేసుకోడానికి అనుమతించారు. ఈ ఘటనలో కొందరు విద్యార్థులు బీర్లు సేవించినట్టు తెలిసింది. హోటల్లో బర్త్ డే పార్టీ వ్యవహారం ఆలస్యంగా తెలిసిన పేరెంట్స్ స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. స్కూల్ బయట జరిగే ఘటనలకు తామెలా బాధ్యులం అవుతామని ప్రశ్నించడంతో చేసేది లేక పేరెంట్స్ మిన్నకుండి పోయారు. పాఠశాలలో టాయిలెట్ ప్రదేశాలు మినహా, ప్రతి ప్రాంతం కవర్ అయ్యేలా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంచినా విద్యార్థులు గాడి తప్పుతున్నారని స్కూల్ యాజమాన్యం చెబుతోంది. ఇళ్ల వద్ద తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ సమస్య వస్తోందని చెబుతున్నారు. పిల్లలు ఏమి చేస్తున్నారో, ఎవరితో తిరుగుతున్నారో గమనించే తీరిక కూడా చాలామందికి ఉండటం లేదని ఇదే సమస్యలకు అసలు కారణమని స్కూల్ యాజమాన్యం చెబుతోంది. రోజుకు 8 గంటలు మాత్రమే స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుందని మిగిలిన సమయంలో వారెక్కడ ఉంటున్నారో, ఏమి చేస్తున్నారో తమకెలా తెలుస్తుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. మొబైల్ అడిక్షన్ విద్యార్థులకు ప్రధాన శత్రువుగా మారిందని చెబుతున్నారు. 7,8 తరగతులకు వరకు క్రమశిక్షణ, మంచి ప్రతిభ చూపించిన విద్యార్థులు కూడా 9,10 తరగతుల్లోకి రాగానే ఒక్కసారిగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నట్టు తెలుస్తోంది. బుధవారం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఈ విషయాలను వివరించారు. విజయవాడలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఒకటైన సదరు పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది. విజయవాడలో విచ్చలవిడిగా లభిస్తున్న మాదకద్రవ్యాలు, మొబైల్ అడిక్షన్, ఆన్‌లైన్ బెట్టింగ్స్ పాఠశాల విద్యార్థుల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఏపీలో గత కొన్నేళ్లుగా రకరకాల సామాజిక రుగ్మతలు పెరుగుతున్నాయి. మాదక ద్రవ్యాల వ్యవహారం మాత్రమే ప్రధానంగా ప్రచారంలోకి వస్తున్నా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ అంతకు మించి సాగుతున్నాయి. విజయవాడ వంటి నగరంలో కూడా ఈ తరహా బెట్టింగ్‌లు నిర్వహించే కేంద్రాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. రకరకాల ఆన్‌లైన ఆటల పేరుతో వేర్వేరు ముఠాలు చెలరేగిపోతున్నాయి. ఈ ముఠాల గురించి పోలీసులకు తెలిసినా వాటిని చూసిచూడనట్టు వదిలేస్తున్నారు. నెలవారీ మామూళ్లు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బెట్టింగ్‌లలో డబ్బు వసూళ్ల కోసం దాడులు జరుగుతున్న ఉదంతాలు కూడా ఉన్నాయి. నగరంలోని బార్ అండ్ రెస్టారెంట్లలో నిత్యం ఈ ఆన్‌లైన్ జూదం నడుస్తోంది. పెద్ద సంఖ్యలో ప్రాంతాల వారీగా ముఠాలు వీటిని నడిపిస్తున్నాయి. ఈ తరహా కార్యక్రమాలను గతంలో యాంటీ గుండా స్క్వాడ్‌లు ఉక్కుపాదంతో అణిచివేసేవి. రకరకాల కారణాలతో టాస్క్‌ఫోర్స్‌లు నిర్వీర్యమైపోయాయి. వ్యవస్థీకృత నేరాలను అదుపు చేయడంకంటే వాటితో కలిసిపోతేనే ఎక్కువ లాభమని దిగువ స్థాయి సిబ్బంది భావిస్తున్నారు. పేకాట క్లబ్బులు, గంజాయి పెడ్లర్లు, ఆన్‌లైన్ గేమ్ నిర్వాహకులు, డ్రగ్ పెడ్లర్లతో ఎస్బీ బృందాలు ఏళ్ల తరబడి సావాసం కొనసాగిస్తున్నాయి. గాంధీనగర్‌లో ఉన్న కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో బహిరంగంగా నిత్యం ఈ దందాలు నడుస్తున్నా పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొన్ని బార్లలో పోలీసుల పర్యవేక్షణలో ఆన్‌లైన్ జూదాలు నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

# పవన్ కామెంట్స్ పై చర్చోపచర్చలు



**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, హైదరాబాద్, ఆగస్టు 9:** సినిమాలకు బ్రేక్ ఇచ్చిన పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో మునిగిపోయాడు. ఏపీ డిప్యూటీ సీఎంగా ఆయన పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. సంక్షేమం దిశగా అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగా పవన్ కళ్యాణ్ కర్ణాటక రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కొన్ని కీలక కామెంట్స్ చేశారు. ఒక నలభై ఏళ్ల క్రితం హీరోలు అడవులను అభివృద్ధి చేసే పాత్రలు చేసేవారు. ఇప్పుడు ఆ అడవులను నరికి స్మగ్లింగ్ చేసే పాత్రల్లో నటిస్తున్నారు. చిత్ర పరిశ్రమకు చెందినవాడిగా అలాంటి పాత్రలు చేయాలంటే నాకు ఇబ్బందిగా ఉంటుంది, అన్నారు. ఈ కామెంట్స్ పవన్ కళ్యాణ్ హీరో అల్లు అర్జున్ ని ఉద్దేశించి చేశాడనే వాదన మొదలైంది. పుష్ప చిత్రంలో అల్లు అర్జున్ ఎర్ర చందనం స్మగ్లర్ రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. పేదవాడైన పుష్పరాజ్ చిన్నప్పటి నుండి హోదా, గౌరవం, గుర్తింపుకు నోచుకోకుండా పెరుగుతాడు. ఆ అవమానాల నుండి పుట్టిన కసి స్మగ్లర్ అయ్యేలా ప్రేరేపిస్తుంది. ఎర్ర చందనం చెట్లు నరికే కూలి స్థాయి నుండి స్మగ్లింగ్ సిండికేట్ ని శాసించే స్థాయికి ఎదుగుతాడు హీరో. దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన పుష్ప భారీ విజయం సాధించింది. అల్లు అర్జున్ కి పాన్ ఇండియా హీరో ఇమేజ్ తెచ్చిపెట్టింది. పుష్ప చిత్రానికి పార్ట్ 2 తెరకెక్కుతుంది. ఈ చిత్రం డిసెంబర్ 6న వరల్డ్ వైడ్ విడుదల కానుంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ ఈ చిత్రాన్ని ఉద్దేశించే అనేది సోషల్ టాక్. కొన్నాళ్లుగా మెగా-అల్లు కుటుంబాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయనే వాదన ఉంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన పరిణామాలు మరింతగా మనస్పర్థలు రాజేశాయనే పుకార్లు ఉన్నాయి. అల్లు అర్జున్ వైసీపీ నేత శిల్పా రవి ఇంటికి స్వయంగా వెళ్లి మద్దతు తెలిపాడు. అల్లు అర్జున్ జనసేన ప్రత్యర్థి పార్టీకి మద్దతు తెలిపినట్లు అయ్యింది. ఈ ఘటన తర్వాత నాగబాబు పరుష పదజాలంతో ఒక ట్వీట్ వేశాడు. వెంటనే దాన్ని డిలీట్ చేశాడు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ నాగబాబును ట్రోల్ చేశారు. అల్లు అర్జున్ ని సాయి ధరమ్ తేజ్ సోషల్ మీడియా అకౌంట్స్ లో అన్ ఫాలో చేశాడు. అలాగే ఉపాసన బర్త్ డే కాగా? అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డి విషెస్ చెప్పలేదు. తాజాగా పవన్ కళ్యాణ్ పుష్ప చిత్రం పై పరోక్షంగా విమర్శలు చేశారు. వరుస పరిణామాల నేపథ్యంలో అల్లు-మెగా ఫ్యామిలీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొందనే ఊహాగానాలు మొదలయ్యాయి. కాగా మరో పాన్ ఇండియా హిట్ కెజిఎఫ్ లో కూడా హీరో స్మగ్లింగ్ కి పాల్పడతాడు. కెజిఎఫ్ లో యష్ హీరోగా నటించాడు. అందులోనూ ఆయన కర్ణాటక హీరో. కాబట్టి పవన్ కళ్యాణ్ జనరల్ గా అందరు హీరోలను ఉద్దేశించి మాట్లాడిన విషయాన్ని అల్లు అర్జున్ కి ఆపాదించడం సరికాదని అంటున్నారు. మెగా ఫ్యాన్స్ ఈ పుకార్లను కొట్టిపారేస్తున్నారు. మెగా హీరోలందరూ ఒక్కటే. వారి మధ్య ఎలాంటి గొడవలు లేవు. సోషల్ మీడియా అనవసరంగా వివాదం సృష్టిస్తుంది అనే వర్గం కూడా ఉన్నారు. సోషల్ మీడియా చాట్ లో నాగబాబు అల్లు అర్జున్ ని ప్రశ్నించడం జరిగింది.

## వైసీపీలో ఏం జరుగుతోంది....

## వరుస షాక్ లు ఇస్తున్న నేతలు

- మొదటి పేజి తరువాయి


ఇక పార్టీకి భవిష్యత్తు లేదని భావిస్తున్న నేతలంతా వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. ఓటమి ఎదురైన వెంటనే విజయవాడ ఎంపీగా పోటీ చేసిన కేశినేని నాని క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. ప్రకాశం జిల్లాకు చెందిన సిద్ధా రాఘవరావు పార్టీకి రాజీనామా చేశారు. సినీ నటుడు అలీ తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ప్రకటన చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన మద్దాలి గిరి, కిలారి రోశయ్య పార్టీకి రాజీనామా చేశారు. ఏ పార్టీలో చేరకపోయినా వైసీపీకి దూరమయ్యారు. అయితే ఫలితాలు వచ్చిన వెంటనే సీనియర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. జూనియర్లు అస్సలు మాట్లాడడం మానేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ప్రతినిధులు వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. ఇప్పటికే విశాఖ నగరపాలక సంస్థ నుంచి కార్పొరేటర్లు టిడిపి, జనసేనలోకి క్యూ కట్టారు. ఇటువంటి తరుణంలో విశాఖ స్థాయి సంఘ ఎన్నికలు జరిగాయి. పదికి పది స్థానాలను టిడిపి కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు. దీంతో విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ముందు వైసీపీకి గట్టి షాక్ తగిలింది. పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు పిఠాపురం నియోజకవర్గం నుంచి. 2019 ఎన్నికల్లో ఇదే సీటు నుంచి గెలిచారు పెండ్యం దొరబాబు. కానీ పవన్ పోటీ చేసేసరికి దొరబాబును పక్కన పెట్టారు. కాకినాడ ఎంపీగా ఉన్న వంగా గీతను తెరపైకి తెచ్చారు. అయితే ఐదేళ్లు సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉంటూ పార్టీ కోసం కష్టపడితే తనను పక్కన పెట్టడాన్ని దొరబాబు జీర్ణించుకోలేకపోయారు. అయితే ఆయన జనసేనలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ అప్పట్లో వైసీపీలోనే కొనసాగారు. అయితే ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో వైసీపీ నుంచి బయటకు వచ్చేశారు దొరబాబు. నిన్ననే పార్టీకి రాజీనామా చేశారు. దొరబాబు తో పాటు మరికొంతమంది వైసీపీలో వీడుతారని ప్రచారం జరుగుతోంది. ఇది రెండో షాక్. అనంతపురం జిల్లాలో వైసీపీ తుడుచుపెట్టుకుపోయింది. కనీసం ఒక్క సీటు కూడా రాలేదు. ఈ తరుణంలో అక్కడ పార్టీకి అండగా నిలిచేవారు కరువయ్యారు. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైల నరసింహయ్య పార్టీకి గుడ్ బై చెప్పారు. వ్యక్తిగత కారణాలతో తాను పార్టీని వీడుతున్నట్లు చెబుతున్నా.. వేరే పార్టీలో చేరేందుకే ఆయన రాజీనామా బాట పట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మరో వైపు కవైపు విశాఖ జిల్లా స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతూనే.. పోలింగ్ వరకు వారికి సేఫ్ జోన్ లోకి తీసుకెళ్లడానికి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. వైసిపికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులను బెంగళూరు క్యాంపునకు తరలించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే టిడిపి కూటమి సైతం బలమైన అభ్యర్థి పీలా గోవింద సత్యనారాయణ ను అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఆయన సైతం బలమైన నేత కావడంతో.. నియోజకవర్గాల వారీగా స్థానిక సంస్థల ప్రతినిధుల మద్దతు కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరఫున వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేశారు. ఎనిమిది వందల పైచిలుకు స్థానిక సంస్థల ఓట్లకు గాను.. 600 మందికి పైగా వైసీపీ ప్రజాప్రతినిధులు ఉన్నారు. టిడిపి కూటమికి కేవలం 200 మంది ప్రతినిధుల బలం మాత్రమే ఉంది. దీంతో అప్పట్లో విపక్షం పోటీ కూడా పెట్టలేదు. దీంతో వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు ముందు ఆయన జనసేనలోకి ఫిరాయించారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. మొత్తానికైతే ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి తేరుకుంటున్న తరుణంలో.. ఇలా నేతలు పార్టీ నుంచి బయటకు రావడం, స్థానిక ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు రావడం వైసిపికి షాకింగ్ ఇచ్చే పరిణామాలే.

## మూడు జిల్లాలకు గజరాజుల సమస్యలకు చెక్...



**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, తిరుపతి ఆగష్టు9:** పవన్ తనకు ఇష్టమైన శాఖలను నిర్వర్తిస్తున్నారు. పల్లెలన్నా, అడవులు అన్నా పవన్ కు ఎంతో ఇష్టం. తన సినిమాల్లో సైతం ఈ రెండు ఇతివృత్తాలను అధికంగా తీసుకుంటారు. ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చాక అదే పరంపరను కొనసాగిస్తున్నారు. డిప్యూటీ సీఎం పోస్టుతో పాటు ఆరు కీలక శాఖలను నిర్వర్తిస్తున్నారు. అందులో అటవీ శాఖ ఒకటి. ప్రధానంగా అడవులను సంరక్షించే చర్యలు చేపడుతున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ పై దృష్టి పెట్టారు. ఉక్కు పాదంతో అణచివేయాలని నిర్ణయించుకున్నారు. మరోవైపు అటవీ జంతువుల సంరక్షణకు కూడా నడుంబిగించారు. అరుదైన జంతుజాలాలను పరిరక్షించుకోవాలని భావిస్తున్నారు. అదే అటవీ జంతువుల నుంచి మనుషులను సైతం రక్షించాలని చూస్తున్నారు. ఏపీలో పలు ప్రాంతాల్లో వన్యప్రాణుల భారీ నుంచి ప్రజలను రక్షించేందుకు సత్వర చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగానే కర్ణాటకలో పర్యటిస్తున్నారు. అక్కడ అటవీ శాఖ మంత్రితో ప్రత్యేక చర్చలు జరపనున్నారు. ఆ చర్చలు విజయవంతం అయితే.. ఏపీలో ఒక దీర్ఘకాలిక సమస్యకు పరిష్కార మార్గం దొరకనుంది. అదే జరిగితే ఏ ప్రభుత్వము చేయని ప్రయత్నం చేసినట్టు అవుతుంది. టిడిపి కూటమి ప్రభుత్వంతో పాటు పవన్ కు ప్రత్యేక గుర్తింపు లభించనుంది. అదే సమయంలో ప్రజలు పడుతున్న బాధకు శాశ్వత పరిష్కారం దొరకనుంది. గతంలో ఏ ప్రభుత్వము ఇటువంటి ప్రయత్నం చేయలేదని తెలుస్తోంది. అందుకే ప్రతి ఒక్కరూ ఆహ్వానిస్తున్నారు. పవన్ కర్ణాటక ఎందుకు వెళ్లారా? అని ఆరా తీస్తున్నారు. ఏపీలో చాలా జిల్లాల్లో వన్యప్రాణుల బెడద అధికంగా ఉంది. ప్రధానంగా ఉమ్మడి చిత్తూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. గ్రామాల మీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. అప్పుడప్పుడు ప్రాణహానిసైతం జరుగుతోంది. అటవీ శాఖ కేవలం కంటి తుడుపు చర్యలకే పరిమితమవుతోంది. ఏనుగులను అడవులకు తరలించే ప్రయత్నాలు సైతం ఫలించడం లేదు. ఈ సమస్య నానాటికీ తీవ్రతరం అవుతోంది. అందుకే అటవీ శాఖమంత్రిగా ఉన్న పవన్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. దశాబ్దాలుగా ఏనుగుల సమస్య అధికంగా ఉంది. ఒడిస్సా లోని లఖేరి అటువుల నుంచి ఏనుగులు తరలి వచ్చాయి. ఉత్తరాంధ్ర ప్రాంతంలో సంచరిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలకు గురిచేస్తున్నాయి. అటు చిత్తూరులో సైతం అదే పరిస్థితి ఎదురైంది. ఈ తరుణంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది ఎకరాల పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఏనుగుల నియంత్రణకు రకరకాల పథకాలు, ప్రయోగాలు తెరపైకి వచ్చాయి. ఏనుగుల క్యారిడర్, అడవుల్లో ట్రంచ్ల ఏర్పాటు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. కానీ ఇవేవీ కార్యరూపంలోకి రాలేదు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే వీటికోసం ప్రత్యేక పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పవన్ అటవీశాఖ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వన్యప్రాణుల నియంత్రణకు ఏం చేయాలి అన్నదానిపై అధికారుల నుంచి నివేదిక తెప్పించుకున్నారు. అయితే ఏనుగులను తరమాలంటే కుమ్కి ఏనుగులు అవసరమని అటవీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన వాటికే కుమ్కి ఏనుగులు అంటారు. దీంతో ఈ ఏనుగుల కోసం అన్వేషణ మొదలుపెట్టారు. అది బెంగళూరులో ఉంటాయని అధికారులు చెప్పడంతో అక్కడి ప్రభుత్వంతో ఆశ్రయించారు పవన్. వాటిని తీసుకొచ్చి ఆపరేషన్ మొదలు పెట్టడానికి నిర్ణయించారు. అందుకే ఈరోజు పవన్ బెంగళూరు పర్యటనకు వెళ్లారు. అక్కడి అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో చర్చలు జరపనున్నారు. త్వరలో ఏనుగుల సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందని బాధిత జిల్లాల ప్రజలు ఆశిస్తున్నారు.

## ఎమ్మెల్సీ దువ్వాడ ఇంటి ముందు కన్న కూతుళ్లు పడిగాపులు




**శ్రీకాకుళం, పెన్‌పవర్ ఆగస్టు 9:** శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూతుళ్లు తండ్రిని కలిసేందుకు ఇంటి ముందర పడిగాపులు కాచారు. దీంతో శ్రీనివాస్ ఇంటి వద్ద అలజడి నెలకొంది . దువ్వాడ శ్రీనివాస్ కుమార్తెలు తమ కుటుంబసభ్యులతో కలిసి గురువారం రాత్రి దువ్వాడ శ్రీనివాస్ ఇంటి ఆవరణలో వేచి ఉండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గత కొంత కాలంగా దువ్వాడ కుటుంబంలో అంతర్గత విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఇంటి ఆవరణలో కుమార్తెలు వేచి ఉండటం పై ఆసక్తి చోటుచేసుకుంది. తన తండ్రిని కలిసేందుకు వచ్చిన ఇద్దరు కూతుళు గంటల తరబడి ఇంటి బయట కార్లో వేచి ఉన్నప్పటికీ దువ్వాడ శ్రీనివాస్ కనీసం ఇంటి గేటు తెరవడంలేదు.....

# నెల రోజులు మ్యాచ్ ల్లేవ్.. టీమిండియా తదుపరి సిరీస్ ఎప్పుడంటే..?




క్రికెటే వ్యసనంగా, క్రికెటే జీవితంగా బతికే భారత అభిమానులకు చేదువార్త ఇది. దాదాపు నెల రోజులకు పైగా టీమిండియాకు ఎలాంటి మ్యాచ్‌ల్లేవ్.. అవును మీరు వింటోంది నిజమే..! ఐపీఎల్.. టీ20 ప్రపంచకప్.. జింబాబ్వే సిరీస్.. శ్రీలంక సిరీస్.. అంటూ బిజీ జీవితాన్ని గడిపిన భారత క్రికెటర్లు 40 రోజుల పాటు విశ్రాంతి తీసుకోనున్నారు. ఐపీఎల్ పుణ్యమా అని 50 రోజుల పాటు తీరికలేని క్రికెట్ ఆడిన భారత క్రికెటర్లు.. అది ముగిసిన వెంటనే టీ20 ప్రపంచకప్ కోసమని అమెరికా, కరీబియన్ దీవులకు వెళ్లారు. అక్కడో 30 రోజులు గడిపారు. అనంతరం పొట్టి ప్రపంచకప్ గెలిచాక స్వదేశానికి చేరుకున్నారో లేదో వెంటనే జింబాబ్వే పర్యటనకు బయలుదేరి వెళ్లారు. అక్కడినుంచి వచ్చిన వెంటనే మరలా శ్రీలంకకు పయనమయ్యారు. ఇలా భారత క్రికెటర్లు ఎప్పుడూ బిజీ బిజీ జీవితాన్ని గడుపుతున్నారు.

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి వారు అడపాదడపా విరామం తీసుకొని పిల్లాపాపలతో కలిసి విదేశీ టూర్లకు వెళ్తున్నా.. ఇతర క్రికెటర్లకు మాత్రం విశ్రాంతి అన్నదే లేదు. అలాంటి వారందరికి ఇప్పుడు సుదీర్ఘ విరామం దొరికింది. టీమిండియా తదుపరి సిరీస్ బంగ్లాదేశ్‌తో జరగనుంది. అది సెప్టెంబర్ నెలలో. అంటే, అప్పటివరకు భారత జట్టు అంతర్జాతీయ క్రికెట్ ఆడదన్నమాట. అయితే, ఈ సమయంలోనూ పలువురు యువ క్రికెటర్లు దేశవాళీ కటోర్నీల్లో కనిపించనున్నారు. ఆగస్టు 15 నుండి ప్రారంభం కానున్న బుచ్చిబాబు క్రికెట్ టోర్నమెంట్‌లో సూర్యకుమార్, ఇషాన్ కిషన్, సర్ఫరాజ్ ఖాన్ వంటి పలువురు సందడి చేయనున్నారు.

**భారత్ పర్యటనకు బంగ్లాదేశ్**

సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఈ టూర్‌లో ఇరు జట్లు రెండు టెస్టులు, మూడు టీ20ల్లో తలపడనున్నాయి.

మొదటి టెస్ట్ (సెప్టెంబర్ 19– 23): చిదంబరం స్టేడియం(చెన్నై)

రెండో టెస్ట్ (సెప్టెంబర్ 27– అక్టోబర్ 1): గ్రీన్ పార్క్ స్టేడియం (కాన్పూర్)

మొదటి టీ20 (అక్టోబర్ 6): ధర్మశాల క్రికెట్ స్టేడియం (హిమాచల్ ప్రదేశ్)

రెండో టీ20 (అక్టోబర్ 9): అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

మూడో టీ20 (అక్టోబర్ 12): రాజీవ్ గాంధీ స్టేడియం (హైదరాబాద్)

# బుమ్రా నాతో బ్యాడ్మింటన్ ఆడగలడా.. నా సర్వ్‌ని అడ్డుకోలేడు: సైనా నెహ్వాల్




భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్ అంగ్రిష్ రఘువంశీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించింది. శుక్రవారం (ఆగస్టు 9) శుభంకర్ మిశ్రాతో జరిగిన ఓ పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె తనపై యువ బ్యాటర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చింది.

**బుమ్రా నా సర్వ్‌ని అడ్డుకోలేడు**

"ఎవరూ చచ్చిపోవడానికే క్రికెట్ ఆడరు. బుమ్రాతో నేనెందుకు క్రికెట్ ఆడాలి? ఒకవేళ బుమ్రా నాతో బ్యాడ్మింటన్ ఆడితే, నా సర్వీస్ అందుకోలేడు.. 300కి.మీ వేగం కావచ్చు.. మరేదైనా కావొచ్చు.." అని సైనా చెప్పుకొచ్చింది.

**గతంలో ఏం జరిగిందంటే..?**

భారత క్రికెట్ జట్టు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారీ నజరానా లభించింది. బీసీసీఐ ఏకంగా రూ.125 కోట్ల రూపాయలను ఆటగాళ్లను నజరానా ప్రకటించింది. మహారాష్ట్ర ప్రభుత్వం రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్‌లకు రూ. 10 కోట్ల నగదు బహుమతులు అందించింది. దీనికి బ్యాడ్మింటన్ ప్లేయర్లకు అన్యాయం జరుగుతుందని సైనా నెహ్వాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత నెలలో నిఖిల్ సింహా పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ క్రికెట్‌పై అందరి దృష్టిని ఆకర్షించడం అన్యాయమని.. అన్ని క్రీడలకు సమానమైన గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేసింది.

"కొన్నిసార్లు, క్రికెట్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ విషయంలో నాకు బాధగా ఉంటుంది. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టెన్నిస్ క్రీడలు శారీరకంగా చాలా కఠినమైనవి. మీకు షటిల్ లో సర్వ్ చేయడానికి కూడా సమయం ఉండదు. కొన్నిసార్లు ఊపిరి కూడా కష్టపడి పీల్చుకోవాల్సి వస్తుంది". అని సైనా నెహ్వాల్ తెలిపింది. సైనా వ్యాఖ్యలకు కేకేఆర్ యువ ప్లేయర్ రఘువంశీ.. "బుమ్రా 150 కి.ల బౌన్సర్ వేస్తే ఎలా ఆడుతుందో" అని తన ఎక్స్ లో తెలిపాడు. అయితే, అతను చేసిన ఈ వ్యాఖ్యలకు సైనా నెహ్వాల్ కు వెంటనే క్షమాపణలు తెలిపాడు.

# నీరజ్ కూడా నా బిడ్డే: పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ తల్లి




ఒలింపిక్స్ జావెలిన్ త్రో లో ఆసియా దేశాలు సత్తా చాటాయి. పాకిస్థాన్, భారత్ కు వరుసగా గోల్డ్, సిల్వర్ మెడల్స్ లభించాయి. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ స్వర్ణ పతకం సాధిస్తే.. భారత అథ్లెట్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. సాధారణంగా పాకిస్థాన్ పై భారత్ ఓడిపోతే అభిమానులు జీర్ణించుకోలేరు. కానీ ఒలింపిక్స్ లో కి వచ్చేసరికి సీన్ మారిపోయింది. రెండు దేశాలు ఇద్దరినీ అభిమానిస్తున్నాయి. ఈ రోజు ఉదయం నీరజ్ తల్లి అర్షద్ ను అభినందిస్తూ అందరూ అథ్లెట్లు తమ బిడ్డలు అని భావిస్తే.. తాజాగా నీరజ్ చోప్రా కూడా తన బిడ్డే అని అర్షద్ తల్లి చెప్పుకొచ్చింది.

నీరజ్ కూడా నా కొడుకు లాంటి వాడు. అతను నదీమ్ స్నేహితుడు.. సోదరుడు కూడా. గెలుపు ఓటములు క్రీడలో భాగం. అతడిని దేవుడు ఆశీర్వదించాలి. భవిష్యత్తులో మరిన్ని మెడల్స్ గెలవాలి. వారిద్దరూ సోదరులు లాంటివారు. నేను కూడా నీరజ్ గెలవాలని ప్రార్థించాను." అని అర్షద్ తల్లి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "నా కొడుకు అర్షద్ పై మద్దతు తెలిపినందుకు పాకిస్థాన్ ప్రజలందరికీ ధన్యవాదాలు. అందరి ప్రార్థనలు ఫలించాయి". ఆమె చెప్పుకొచ్చింది.

**అతనూ మన బిడ్డే..**

అంతకుముందు నీరజ్ తల్లి సరోజ్ దేవి.. పాకిస్థాన్ అథ్లెట్ ఆర్షద్ నదీమ్ పై ఇలానే స్పందించారు. అతను కూడా మన బిడ్డే అని వ్యాఖ్యానించారు.

"ఒలింపిక్స్ లో నీరజ్ చోప్రాకు సిల్వర్ మెడల్ వచ్చింది. ఆ విజయం పట్ల మేం సంతోషంగా ఉన్నాం. గోల్డ్ మెడల్ గెలుచుకున్న అర్షద్ కూడా మన బిడ్డ లాంటి వాడు. ఆటలో గెలుపు ఓటములు సహజం. ఆసియాలో ఇరుగు పొరుగు దేశాలు అయిన భారత్, పాకిస్థాన్.. గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించాయి. ఇది మనందరికీ గర్వకారణం.." అని నీరజ్ తల్లి సరోజ్ దేవి జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. గురువారం (ఆగస్ట్) అర్ధ రాత్రి జరిగిన ఫైనల్లో అర్షద్ ఏకంగా 92.97 మీటర్లు జావెలిన్ విసరగా.. నీరజ్ చోప్రా రెండో ప్రయత్నంలో అత్యధికంగా 89.45 మీటర్ల దూరం విసిరాడు. దీంతో పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ కు గోల్డ్ మెడల్.. భారత అథ్లెట్ నీరజ్ చోప్రాకు సిల్వర్ మెడల్ లభించాయి.

## శార్వరి అద్భుతమైన ఇన్‌స్టాగ్రామ్ స్నాప్‌లు



# స్టార్ హీరోయిన్ నెక్లెస్ ధర తెలిస్తే మైండ్ బ్లో

గ్లోబల్ స్టార్‌గా పాపులరైంది ప్రియాంక చోప్రా. అమెరికన్ గాయకుడు నిక్ జోనాస్‌ని పెళ్లాడాక అమెరికాలోనే నివాసం ఉంటోంది. ముంబైలో వ్యవహారాల్ని చక్కబెడుతూనే అమెరికాను హాలీవుడ్ ని విడిచిపెట్టడం లేదు. ఇటీవల అంబానీల ఈవెంట్ కోసం ముంబైలో అడుగుపెట్టిన ప్రియాంక చోప్రా, బాలీవుడ్ లో సొంత బ్యానర్ సినిమాలపైనా దృష్టి సారించింది.

మరోవైపు ప్రియాంక చోప్రా వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. తాజాగా పీసీ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. ఈ ఫోటోషూట్ లో పీసీ మతి చెడేలా అందాలను ఆరబోసింది. డార్క్ బ్యాక్ గ్రౌండ్ తో ఫోటోషూట్ ఇది. నేపథ్యానికి తగ్గట్టుగానే పూర్తిగా బ్లాక్ షిమ్మరీ ఫ్రాక్ ని ధరించిన పీసీ ఎద అందాలు మతులు చెడగొడుతున్నాయి. ఈ సొగసును మించి అందరి కళ్లు వేరొక వస్తువుపైకి వెళుతున్నాయి. అది ప్రియాంక చోప్రా ధరించిన ఖరీదైన డైమండ్ నెక్లెస్.

ఈ వజ్రాల హారం ధర రూ. 358 కోట్లు అని తెలిస్తే ఎవరైనా షాక్ కి గురవ్వకుండా ఉండగలరా? ఇది పాపులర్ బ్రాండ్ కి చెందిన నెక్లెస్ అని తెలిసింది. బల్గారి బ్రాండ్ 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఒక ఈవెంట్‌లో ప్రియాంక చోప్రా ఇటీవల అద్భుతంగా కనిపించింది. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఒక విషయం పీసీ ధరించిన అద్భుతమైన నెక్లెస్. ఆ ఆభరణం ధర రూ. 358 కోట్లు. ఈ నెక్లెస్‌లో 140 వజ్రాలు ఉన్నాయి. అంటే బ్రాండ్ ఎన్నో వార్షికోత్సవంలోకి వెళితే అన్ని వజ్రాలతో ఈ నెక్లెస్ ని డిజైన్ చేస్తున్నారని సమాచారం. ఈ నెక్లెస్ బల్గారి అంతర్జాతీయ బ్రాండ్ కి చెందిన అత్యంత విలువైన సర్పెంటి నెక్లెస్‌లలో ఒకటి. ఈ కళాఖండాన్ని సిద్ధం చేయడానికి స్పష్టంగా 2800 గంటలు పట్టింది.

కెరీర్ పరంగా చూస్తే.. ప్రియాంక చోప్రా హాలీవుడ్ లోను పాపులరైంది. బాలీవుడ్ , హాలీవుడ్ లో తనకు తెరుచుకునే అనేక తలుపులు ఉన్నాయని చెప్పడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల మంది మహిళలకు ప్రియాంక చోప్రా మనో ధైర్యాన్ని ఇవ్వగలిగింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో పీసీ నటించిన షో సిటాడెల్ గత సంవత్సరం చాలా ఎక్కువగా చర్చనీయాంశమైంది. దాని భారతీయ వెర్షన్ త్వరలో %ు% లో ప్రసారం కానుంది. సమంత, వరుణ్ ధావన్ నటించగా దీనిని రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు.



## స్టైలిష్ పింక్ దుస్తులతో అంజలి అభిమానుల ను ఆకట్టుకుంది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com